సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం, 29, నవంబర్, 2024



సౌత్, సెంట్రల్ జట్లు విజయం

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–23 జోనల్ క్రికెట్ మ్యాచ్‌లలో సౌత్‌జోన్, సెంట్రల్ జోన్, తూర్పుగోదావరి జట్లు విజయం సాధించాయి. –8లో



శిక్షణల పేరుతో ఉపాధ్యాయుల ప్రాణాలను బలిగొంటారా?

శిక్షణల పేరుతో ఉపాధ్యాయుల ప్రాణాలను బలిగొంటారా అని ప్రభుత్వంపై యూటీఎఫ్ నేతలు ధ్వజమెత్తారు. –8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.4/20.9

జిల్లాలో గురువారం 20.9 – 28.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి నుంచి వైవీయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఈనెల 29 నుంచి డిసెంబర్ 21వ తేదీ వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాల్లో 1వ, 3వ, 5వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రథమ సెమిస్టర్ పరీక్షలకు 8407 మంది, తృతీయ సెమిస్టర్‌కు 6903, 5వ సెమిస్టర్ పరీక్షలకు 5509 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వైవీయూ పరిధిలో నిర్వహించే డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు తెలిపారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపిక

వైవీయూ: ఈ నెల 29వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు తమిళనాడులోని అలగప్ప విశ్వవిద్యాలయంలో నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ జోనల్ పోటీలకు ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఇటీవల వైవీయూలో నిర్వహించిన విశ్వవిద్యాలయ స్థాయి కబడ్డీ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన పి.ఇంద్రావతి, ఎస్.ఉషశ్రీ, కె.శైలజలను అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే వైవీయూ జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా, ఫిజికల్ డైరెక్టర్ కె. మదన్‌మోహన్ విద్యార్థులను అభినందించారు.

రిమ్స్ దంత వైద్య కళాశాల విద్యార్థి ప్రతిభ



విద్యార్థి శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోత్స్న తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రిమ్స్ దంత వైద్య కళాశాలలో పోస్టొడాంటిక్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన విద్యార్థి డాక్టర్ కుప్పాల వెంకట శ్రీకాంత్ ఇటీవల ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన ఎండీఎస్ పరీక్షలో ప్రతిభ చూపి యూనివర్సిటీ ప్రథమ ర్యాంకు సాధించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న ఈ విద్యార్థిని గురువారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈ విద్యార్థిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో అందరూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. మధ్య తరగతి నుంచి వచ్చిన తాను.. ఒకవైపు కుటుంబ ప్రోత్సాహం, మరోవైపు ప్రొఫెసర్ల సూచనలతో నిరంతరం శ్రమించి ఈ విజయాన్ని సాధించానని శ్రీకాంత్ తెలిపారు.

గుంటూరులో రాష్ట్రస్థాయి సైక్లింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: గుంటూరు నగరంలో ఈనెల 30, డిసెంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సైక్లింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి తెలిపారు. శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు సైక్లింగ్ క్రీడాకారులు వారి సొంత సైక్లింగ్ పరికరాలతో ఎంపికలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడం గ్రామంలోని గుడ్‌రోల్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో 30వ తేదీ ఉదయం 8 గంటలకు రిపోర్ట్ చేయాలని కోరారు. అంతర్ జిల్లాల పోటీల్లో రాణించే క్రీడాకారులు డిసెంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు ఒరిస్సా రాష్ట్రంలోని పూరిలో నిర్వహించే 29వ జాతీయ సైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు గుంటూరు డీఎస్ఏ సైక్లింగ్ శిక్షకుడు వి. కనకారావు 98493 79932, అథ్లెటిక్స్ శిక్షకుడు ఎస్. శివారెడ్డి 97030 92077 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వాటర్‌షెడ్ నిధుల ద్వారా భూగర్భ జలాలు పెంపు



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

బి.కోడూరు: వాటర్‌షెడ్ నిధులతో చేపట్టిన చెక్‌డ్యాం నిర్మాణం ద్వారా భూగర్భజలాలను పెంపొందించుకోవచ్చని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద్దుళ్ళపల్లె మైక్రోవాటర్‌షెడ్ పరిధిలో గతంలో చేపట్టిన పనులు, రాతి కట్టడాలు, అమృత్‌సరోవర్, నీటి కందకాలు, చెక్‌డ్యాం, సోలార్‌లైట్లు, రైతుల వ్యవసాయ పనిముట్లను ఆయన పరిశీలించారు. పనులలో వాటర్‌షెడ్ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అలాగే రైతులకు ఇచ్చిన వ్యవసాయ పనిముట్లు ఏవిధంగా ఉపయోగంలో ఉన్నాయని గ్రామ ప్రజలతో ముఖాముఖి చర్చించారు. డ్వామా ఏపీడీ నాగరత్నమ్మ పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యానికి ప్రణామం

- జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రకృతి సేద్యం విస్తరణ
- జిల్లాలో 257 పంచాయతీల్లో ముమ్మరంగా సాగు పనులు
- 39,846 మంది రైతులు 54,947 ఎకరాల్లో వివిధ పంటల సాగు
- ప్రకృతి సేద్యంపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది
- ఏటా పెరుగుతున్న సాగుదారులు.. విస్తీర్ణం



బొప్పాయిలో అంతర్ పంటగా పూలను సాగు చేసిన రైతులు



సాగు వివరాలు ఇలా...

సంవత్సరం	మండలాలు	పంచాయితీలు	రైతులు	సాగు విస్తీర్ణం
2016–17	9	52	9,610	10,695
2017–18	20	83	12,411	14,803
2018–19	20	127	23,221	36,424
2019–20	41	223	44,129	51,053
2020–21	45	229	50,320	57,868
2021–22	45	229	61,650	81,870
2022–23	36	232	55,794	72,865 (వైఎస్సార్)
2–23–24	36	257	61,281	91,953 "
2024–25	36	257	39,846	54,947 (ఇప్పటివరకు)

(ఉమ్మడి జిల్లా)

కడప అగ్రికల్చర్: రసాయన ఎరువులు, పురుగు మందులు లేని ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేగంగా పడుతున్నాయి. నాణ్యమైన, బలవర్ధకమైన పంటలను పండిస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్న రైతులు.. తాము సాధించిన విజయాన్ని మరో నలుగురికి పంచుతూ ముందుకు సాగుతున్నారు. అ నలుగురు మరో నలభైమందికి ఇలా నేడు వేల సంఖ్యలో రైతులు ప్రకృతి సేద్యం సాగువైపు మళ్లారు. ఈ మేరకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూడా అధిక దిగుబడులను సాధిస్తున్న రైతుల అనుభవాలను ఆయా ప్రాంతాల్లో మరికొంతమంది రైతులకు వారి ద్వారానే అవగాహన కల్పిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ముందుకు నడిపిస్తున్నారు. ఇలా జిల్లాలో 2024–25 ఏడాదికి సంబంధించి 72,176 మంది రైతులు 1,04, 267 (ఖరీఫ్, రబీ కలిసి) ఎకరాల్లో సాగు చేయాలనే లక్ష్యంగా చేసుకోగా ఖరీఫ్ ముగిసే నాటికి 39,846మంది రైతులు 44,947 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేశారు. ఇంకా రబీ సీజన్ ముగిసే నాటికి లక్ష్యాన్ని చేరుకోనున్నారు.

విపరీతంగా రసాయనిక మందులు...

నేటి పోటీ వ్యవసాయంతో చాలా మంది రైతులు తాము సాగుచేసిన పంటలకు విపరీతంగా రసాయన ఎరువులు, పురుగు మందులను వాడుతున్నారు. ఇది అనారోగ్యానికి దారి తీస్తుంది. దీంతోపాటు పొలాల్లోని మట్టిలో సత్తువ తగ్గి, విపరీత పురుగు ముందులు, రసాయనిక ఎరువుల వాడంతో సాగుకు మేలు చేసే సూక్ష్మ జీవులు (ఎర్రలు) అంతరించిపోతున్నాయి. దీంతో భూమి నిస్సత్తువగా మారి నానాటికి సాగు ఖర్చు పెరుగుతూ దిగుబడులు తగ్గడంతోపాటు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో నేడు రైతులకు వ్యవసాయం భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో తక్కువ వ్యయమయ్యే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టిని సారిస్తున్నారు.

సిబ్బందిని ఏర్పాటు చేసి....

గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అధికారులు సాగు పెంచేందుకు అనుగుణంగా అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు. అంతేకాకుండా ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కూడా ప్రకృతి వ్యవసాయం చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తూ ముందుగు సాగుతున్నారు. విత్తు వేసే దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు రైతులకు సాగులో కావాల్సిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ద్రవ, ఘన జీవామృతాలు, చీడపీడల నివారణకు కషాయాల తయారీ వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యక్షంగా చేసి చూపడంతోపాటు వారితో కూడా తయారు చేయిస్తున్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా స్థానికంగా దొరికే ప్రకృతి సిద్ధమైన వాటితో సేంద్రియ ఎరువులు తయారు చేసి వాటిని ఉపయోగించి మంచి దిగుబడులు సాధించేలా అవగాహన కలిప్తూ రైతుల్లో చైతన్యం నింపుతూ ప్రకృతి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

ప్రతి ఏటా పెరుగుతూ ....



జిల్లాలో ప్రకృతి వ్యవసాయ సాగు ఏడాదికేడాది క్రమేపీ పెరుగుతూ వస్తోంది. ఇందుకు జిల్లాలో ప్రకృతి సేద్య అధికారులు సిబ్బందితో రివ్యూలు చేస్తూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు డివిజన్, మండలస్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి గ్రామాల్లో సదస్సు జరిగినప్పుడు రైతులకు వివరిస్తూ సాగుకు ప్రోత్సహిస్తున్నారు. పైగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను సాగు చేస్తున్న రైతులు పొలంలో రాజీలేని సూత్రాలను పాటించి మంచి దిగుబడులను సాధించాలని సూచిస్తున్నారు.

అంతర్ పంటలతో ఆదాయం

దీర్ఘకాలిక పంటలైన చీనినిమ్మ, మామిడి, పూల తోటలు, వరి పంటలకు మధ్యలో అంతర్ పంటల కింద కూరగాయలు సాగు చేస్తున్నారు. వీటితో నిత్యం ఆదాయం సమకూరుతుంది. దీంతోపాటు ఏడాది క్రాపులలో కూడా అంతర్ పంటలుగా పలు ఆకుకూరలు, కూరగాయలను సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన ఆకుకూరలకు, కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు ఆదాయం సమకూరుతుంది.



మామిడిలో అంతర్ పంటగా సాగు చేసిన కూరగాయలు

ప్రకృతి సాగు పెరుగుతోంది...



ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడి తగ్గించుకునేందుకు ఆలోచిస్తున్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సులతో ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం తెస్తున్నాం.
– ప్రవీణ్‌కుమార్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి వ్యవసాయ సేద్యం

ఆదర్శప్రాయుడు మహాత్మా జ్యోతిబా పూలే

- జేసీ అదితి సింగ్
- ఘనంగా పూలే వర్ధంతి



మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: మహాత్మా జ్యోతిబా పూలే ఆదర్శ ప్రాయుడని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ పయనించాలని జేసీ అదితి సింగ్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జరిగిన మహాత్మ జ్యోతిబా పూలే వర్ధంతి సభా కార్యక్రమానికి జేసీ అదితిసింగ్ హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సామాన్య జీవితంతో అసాధారణంగా కృషి చేసిన మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి అన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలను.. దోపిడీ వ్యవస్థ, అంటరాని తనం నుండి విముక్తి చేయడానికి నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి పూలే అన్నారు. సమాన హక్కుల కోసం, కులవ్యవస్థ నిర్మూలన, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధి కోసం సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. కుల వ్యవస్థను రూపుమాపాలంటే ప్రతి ఒక్కరూ ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నతంగా అభివృద్ధి చెందినపుడే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఆర్వో శ్రీనివాసులు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కృష్ణయ్య, కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, కార్యాలయ సిబ్బంది, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యం ముఖ్యమే

గోపవరం: విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం ముఖ్యమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాచాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంహెచ్‌ఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత వలన జరిగే ఇబ్బందుల గురించి వివరించారు. విద్యార్థులు భోజనానికి ముందు చేతులు శుభ్రపరుచుకోవాలన్నారు. పోషక పదార్థాలు తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని, అప్పుడే చదువుపై కూడా ధ్యాస కలుగుతుందని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మండల వైద్యాధికారులు మహేశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణలు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ బాలబాలికల సంరక్షణ అధికారి రమేష్, సీహెచ్‌ఓ గౌస్ పాల్గొన్నారు.

'ఒంటిగంటకే ఫైనల్ బెల్'తో కదలిక!

- ఇంటర్ కమిషనరుతో రాజ్యసభ సభ్యుడు మేడా చర్చలు
- షిఫ్ట్ నుంచి హైస్కూలు, ఇంటర్‌కు విముక్తి కల్పించాలి

సాక్షి ఎఫెక్ట్..

రాజంపేట: నందలూరు జిల్లా పరిషత్ పాఠశాల పరిస్థితిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. మూడు దశాబ్దాల తర్వాత తొలిసారిగా హైస్కూల్ తరగతు లను రెండుపూటలా నిర్వహించారు. 'ఒంటిగంటకే ఫైనల్ బెల్' శీర్షికన 'సాక్షి'లో ఈనెల 26న ప్రచురిత మైన కథనానికి అధికారులు స్పందించారు. శతాబ్ది స్వర కాలం నాటి ఈపాఠశాల ఐఏఎస్‌ల పాఠశాలగా గుర్తింపు పొందింది. మూడు దశాబ్దాలుగా షిఫ్ట్ విధా నంతో హైస్కూలు విద్య పడిపోయింది. అదే క్యాంపస్‌లో ఇంటర్ కళాశాల కొనసాగింపు వల్ల హైస్కూ లు, ఇటు ఇంటర్ విద్యాబోధనలు,ప్రగతి పడిపోతున్న క్రమంలో ప్రచురితమైన సాక్షి కథనం రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి వెళ్లాయి.

రెండుపూటలా హైస్కూల్ తరగతులు

హైస్కూల్ క్యాంపస్‌లో ఇంటర్ కళాశాల ఉండటం వల్ల మంగళవారం షిఫ్ట్‌లో ఉన్న హైస్కూలు 'సాక్షి'లో కథనంతో బుధవారం షిఫ్ట్ లేకుండా తరగతులు నిర్వహించారు. కానీ.. గదులు లేక చెట్ల కింద తరగతులు నిర్వహించుకోవాల్సి వచ్చింది.

ఇంటర్‌బోర్డు కమిషనరుతో మేడా చర్చలు

నందలూరు హైస్కూల్ క్యాంపస్‌లో ఇంటర్ కళాశాల కొనసాగించడం వల్ల దశాబ్దాల పాటు కొనసాగిన షిఫ్ట్ విధానానికి స్వస్తి పలకాలని ఇంటర్‌మీడియట్ బోర్డు కమిషనర్ కృతికాశుక్లాతో ఐఏఎస్‌తో రాజ్యసభ సభ్యు డు మేడా రఘునాథ్ రెడ్డి ఫోన్ ద్వారా చర్చలు జరిపారు. హైస్కూల్ క్యాంపస్‌లో ఇంటర్ కళాశాల కొనసాగింపుపై కొనసాగుతున్న అంశంపై ఆమెతో మాట్లాడారు. షిఫ్ట్ విధానం నుంచి హైస్కూలు, ఇంటర్‌కు విముక్తి కల్పించడం వల్ల విద్యాప్రగతికి బాటలు వేసినమవుతామని వివరించారు. ఈ విషయమై కమిషనరు సానుకూలంగా స్పందించారని రాజ్యసభసభ్యుడు మేడా రఘునాథ్ రెడ్డి ధృవీకరించారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా ఫరూక్



నూతనంగా ఎన్నికై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు

కడప అర్బన్: ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (కడప రిమ్స్ యూనిట్) ఎన్నికలను గురువారం కడపలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ ఎన్నికలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాబ్జీ శ్యామ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగాయి. ఏకగ్రీవంగా ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షునిగా డాక్టర్ ఫరూక్ (అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈఎన్‌టి), కార్యదర్శిగా డాక్టర్ సుబ్బరాయుడు (ఎస్‌పీఎం అసోసియేట్ ప్రొఫెసర్), కోశాధికారిగా డాక్టర్ శ్రీధర్‌రెడ్డి (జనరల్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్)లతో కూడిన కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ నూకరాజు ఎన్నికల అధికారిగా వున్నారు.

తపాలాకు మహిళల తాకిడి!

- బాబు రూ.1500 జమ చేస్తారనే ప్రచారం
- తపాలా కేంద్రాలకు భారీగా తరలివస్తున్న మహిళలు
- ఉదయం నుంచే వందలాది మహిళల క్యూ
- సూపర్‌సిక్స్ పథకాల కోసమేనని ప్రచారం
- ఐపీపీబీ అకౌంట్ ఓపెన్ కోసం ఆరాటం



రాయచోటి పోస్టాఫీసులో మహిళల రద్దీ

డివిజన్	పోస్టాఫీసులు	ఏపీపీబీ ఖాతాలు
కడప	451	73,173
ప్రొద్దుటూరు	376	30,000

రాజంపేట: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని అన్ని తపాలా కేంద్రాలు వేలాదిగా తరలివస్తున్న మహిళల తాకిడితో కిక్కిరిసిపోతున్నాయి. 18 ఏళ్లపైబడిన మహిళలందరి వ్యక్తిగత ఖాతాల్లో సీఎం చంద్రబాబు రూ.1500 జమచేస్తారన్న విస్తృత ప్రచారంతో మహిళలు పోస్టాఫీసుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ప్రతిరోజు చలిని సైతం లెక్క చేయకుండా ఉదయం 5గంటల నుంచి క్యూ కడుతున్నారు. నెలరోజులుగా పరిస్థితి ఉన్నా.. ఈ మధ్య రోజురోజుకు వీరి సంఖ్య మరింతంగా పెరుగుతోంది. పోస్టాఫీసుల వద్ద తోపులాట జరిగే స్థాయి ఉందంటే మహిళల తాకిడి ఎలా ఉందో అర్థమవుతుంది. కడప, ప్రొద్దుటూరులో పోస్టాఫీసు డివిజన్లు ఉన్నాయి.

సూపర్ సిక్స్ పథకాల కోసమంటూ..

టీడీపీ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తామంటూ కూటమి నేతలు పదేపదే చెబుతున్నారు. ఇందులో భాగంగా 18 ఏళ్లు నిండిన మహిళ ఖాతాల్లో రూ.1500 జమ చేస్తారని ప్రచారాన్ని జనం మధ్యలోకి కూటమి నేతలు తీసుకెళ్లారు. దీంతో మహిళలు అది నిజం అని నమ్మి పోస్టాఫీసులు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు. మహిళలు భారీ సంఖ్యలో వస్తున్న క్రమంలో అందుకు తగ్గట్టుగా చర్యలేవీ కనిపించడంలేదు.

నగదు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతా కోసం..

నగదు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతా కోసం మహిళలు తపాలా కేంద్రాలకు వెళుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఐపీపీబీ (ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్) ఖాతాల్లో జమ అవుతాయి. ఇందులో ఖాతాలు తెరిచినంత మాత్రాన లాభంలేదు. ఆధార్ లింక్ కాగలిగివుండాలి. ఆధార్ సీడింగ్ అయి ఉండాలి.

బ్యాంకర్స్‌పై సీడింగ్ చేయడం లేదనే ఆరోపణలు

బ్యాంకర్లు ఖాతాలకు ఆధార్ లింక్ చేస్తున్నా, సీడింగ్ చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగా మహిళలు తపాలశాఖ ఇచ్చే ఐపీబీఏ ఖాతాలు తెరిచేందుకు భారీగా తరలివస్తున్నారు. ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ కానివారు ఉభయ వైఎస్సార్ జిల్లాలో లక్షలాదిమంది ఉన్నట్లు సమాచారం. బ్యాంకులలో ఆధార్ సీడింగ్ కాని మహిళలు ఐపీబీఏ ఖాతాల కోసం తపాలా కేంద్రాలకు తరలివెళుతున్నారు.

రూ.1500పై ఉన్నతాధికారులు స్పందించాలి

ఉన్నతాధికారులు స్పందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మహిళలు రూ.1500 చొప్పున ఖాతాల్లో ఎప్పుడు జమచేస్తారు. అందుకోసం మహిళలు ఏమి చేయాలి. ఇప్పటికే బ్యాంక్ ఖాతాలున్న మహిళలు ఏం చేయాలి. ఖాతాలు లేని వారు ఏ పోస్టాఫీసుకు లేదా ఏ బ్యాంకును సంప్రందించాలనే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరోవైపు రూ.1500 వట్టి ప్రచారమన్న భావనలు జనంలో వినిపిస్తున్నాయి.

ఐపీపీబీ ఖాతాల ఓపెనింగ్‌కు విశేష స్పందన



ఐపీపీబీ(ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకు) ఖాతాలకు విశేష స్పందన లభిస్తోంది. జిల్లాలోని అన్ని పోస్టాఫీసులలో మహిళలు ఖాతాలను తెరుచుకుంటున్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఖాతాలను తెరుచుకునేందుకు పోస్టాఫీసు సిబ్బంది సంపూర్ణ సహకారం అందిస్తున్నారు.
– రాజేష్, పోస్టల్ సూపరింటెండెంట్, కడప

క్లుప్తంగా

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

ముద్దనూరు : మండలంలోని మంగపట్నం గ్రామంలో అదృశ్యమైన బోడెద్దుల జగదీశ్వర రెడ్డిని పోలీసులు గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు ఈనెల 5వతేదీనుంచి జగదీశ్వర రెడ్డి కనిపించలేదని అతని తండ్రి ఫిర్యాదు చేశారు. అతని ఆచూకీ తెలియడంతో తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఫుట్‌బాల్ నేషనల్స్‌కు గౌతమ్



కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ ఫుట్‌బాల్ శిక్షకుడు అమృత్‌రాజ్ వద్ద శిక్షణ పొందిన పి. గౌతమ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే 68వ జాతీయస్థాయి అండర్–17 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 30 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్‌లో నిర్వహించే ఈ పోటీల్లో ఈయన పాల్గొననున్నాడు. కాగా గత ఏడాది మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన జూనియర్ నేషనల్స్‌లో సైతం ఈయన పాల్గొని సత్తా చాటాడు. కాగా ఈయన ప్రస్తుతం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి, కోచ్ అమృత్‌రాజ్ అభినందనలు తెలిపారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలను తెలియజేస్తున్న రిమ్స్ పీఎస్ సీఐ సీతారామిరెడ్డి

కడప అర్బన్ : కడప నగరం రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జకరయ్య మిల్లు సమీపంలో సీఐ సీతారామిరెడ్డి, తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఆ సమయంలో అటుగా అనుమానంగా వెళుతున్న పూల సునీల్‌కుమార్ అలియాస్ సునీల్, సయ్యద్ మహమ్మద్ నయాజ్, చాంద్‌బాషాలను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గ్యాస్ సిలిండర్ లీకేజీ

చక్రాయపేట : మండలంలోని కుప్పం గ్రామం బురుజుపల్లెలో గురువారం ఉదయం గ్యాస్ సిలిండర్ లీకేజీ అయిన ప్రమాదంలో ఇంటిలోని సామాన్లన్నీ కాలి బూడిదయ్యాయి. కాగా వృద్ధులకు ప్రమాదం త్రుటిలో తప్పి గాయాలతో బయట పడ్డారు. బాధిత వృద్ధులు వేంపల్లె ఇమాంసాహెబ్, హుస్సేనమ్మలు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయమే ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా మంటలు రేగాయి. దీంతో వృద్ధులు లేచి బయటకు వచ్చేసరికి మంటల కారణంగా కాళ్లు, చేతులతో పాటు శరీరంపై గాయాలయ్యాయి. ప్రమాదంలో బీరువాలోని దుస్తులు, నగదు, రిఫ్రిజిరేటర్, ఎల్‌ఈడీ కలర్ టీవీతో పాటు సామాన్లన్నీ కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో సుమారు రు.2లక్షల మేర నష్టం జరిగినట్లు అంచనా. గాయపడిన హుస్సేనమ్మను చికిత్స నిమిత్తం రాయచోటికి తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు. ఇమాంసాహెబ్‌కు గ్రామంలోనే ఉన్న ఆర్ఎంపీ వైద్యుడి వద్ద ప్రథమ చికిత్స చేయించామన్నారు.

శిక్షణల పేరుతో ప్రాణాలను బలిగొంటారా?

డీఈఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నిరసన



డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : శిక్షణల పేరుతో ఉపాధ్యాయుల ప్రాణాలను బలిగొంటారా అని రాష్ట్ర ప్రభుత్వంపై యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన లీడర్‌షిప్ రెసిడెన్షియల్ శిక్షణా తరగతుల్లో ఇద్దరు ప్రధానోపాధ్యాయులు మరణించడం పట్ల, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని, విద్యాశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లీడర్‌షిప్ ట్రైనింగ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణలను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. వేసవి సెలవుల్లో ఇవ్వాల్సిన శిక్షణలను విద్యా సంవత్సరం మధ్యలో ఏర్పాటు చేయడమే కాకుండా ఉపాధ్యాయులు కచ్చితంగా రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ పొందాలని అడ్డగోలు నిబంధనలను విధించి ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. శిక్షణా కేంద్రాలలో సరైన సౌకర్యాలు లేక, అనారోగ్యాలతో ఉన్న ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మొదటి విడత శిక్షణలో ఏలూరు జిల్లాలోని అగిరిపల్లె శిక్షణా కేంద్రంలో టి.వి.రత్న కుమార్ అనే ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించగా, రెండవ విడత శిక్షణలో విజయనగరం జిల్లా గజపతినగరంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులలో గురువారం సిరిపురం శ్రీనివాసరావు అనే మరో ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించాడన్నారు. ఇద్దరు ప్రధానోపాధ్యాయుల మరణానికి కారణమైన రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా తమ అనాలోచిత విధానాలను విడనాడి శిక్షణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి. రమణ, ఏజాస్ అహ్మద్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల మృతికి బాధ్యులెవరు?



మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్ : రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయుల మృతికి ఎవరు బాధ్యత వహిస్తారని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం కడప ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమం వలన ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు.

శిక్షణ కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ కార్యక్రమాలు రద్దు చేసి ఉపాధ్యాయుల కుటుంబానికి తక్షణమే తగిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి బి.చంద్రశేఖర్, సలాం, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయా:ఏపీటీఎఫ్

రాష్ట్ర వ్యాప్తంగా టీచర్లకు జరుగుతున్న రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాలను రద్దుచేసి నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో తాలూకా కేంద్రాలలో నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించవద్దని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని అనేకమార్లు డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందన్నారు.

గతి తప్పిన కూటమి ప్రభుత్వ పాలన

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలల్లో రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని, పాలన గతి తప్పిందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగాలు లేవు.. నిరుద్యోగ భృతి రూ.3 వేలు లేదు.. అసలు ఆ ఆలోచన లేదని అసెంబ్లీ సాక్షిగా తేల్చేశారన్నారు. పైగా ఉన్న ఉద్యోగాలు పీకేస్తున్నారని, 2.60 లక్షల మంది వలంటీర్లను పక్కన పెట్టేశారన్నారు. వలంటీర్లకు రూ. 10వేలు గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ తుంగలో తొక్కారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. రాజకీయాల్లో చంద్రబాబును మించిన నేరస్తుడు లేదని ఆయన ధ్వజమెత్తారు. విద్యార్థుల ఫీజు డబ్బు ఒక్క పైసా ఇవ్వలేదని, డిసెంబర్‌కు రూ.2800 కోట్లకు పైగా ఫీజులు రీయింబర్స్ చేయాల్సి ఉందన్నారు. వసతిదీవెన బకాయిలు ఈ డిసెంబర్‌కు రూ.3,900 కోట్లకు చేరుకుంటాయన్నారు. ఫీజులు కట్టకపోతే విద్యార్థులను కాలేజీకి రానివ్వడం లేదని, సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని చెప్పారు. ప్రతిపక్షపార్టీని ఇబ్బందులు పెట్టేందుకు నాయకులపై లెక్క లేనన్ని తప్పుడు కేసులు బనాయించి రాష్ట్రంలో అశాంతికి కారణమవుతున్నారని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

రాయచోటి (జగదాంబసెంటర్) : రాయచోటి పట్టణం మాసాపేటలో గల శ్రీ సుగవాసి రాజారాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.శివకుమార్‌రెడ్డి తెలిపారు. అనంతపురంలోని వజ్రకరూరులో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి కడప జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించి కె.అరాఫత్ (పదవ తరగతి) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్–14 సాఫ్ట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో కడప జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించి జిల్లా జట్టు నుంచి పి.వెంకటేష్(9వ తరగతి), బి.భవంత్‌సాగర్(9వ తరగతి) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు తిరుపతిలోని మంగళం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్–14 బేస్‌బాల్ లో కడప జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించి ఎం.సంతోష్(9వ తరగతి), బి.సంతోష్(8వ తరగతి) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరులో జరిగిన అండర్–17 బేస్‌బాల్ పోటీలో డి.శివరాం(10వ తరగతి) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హెచ్ఎం శివకుమార్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ పాఠశాల నుంచి ఈ ఏడాది ఆరుగురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ సంచాలకుడు ఏ.జగదీశ్వరయ్య తెలిపారు.

ఘనంగా వల్లూరు వంశీనాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు



అభిమానులతో కలిసి కేక్ కట్ చేస్తున్న వల్లూరు వంశీనాథ్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ కాంట్రాక్టర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వల్లూరు వంశీనాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ పార్క్ రోడ్డులోని ఆయన కార్యాలయం వద్ద ఆయన అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఆయన ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు పాకా సురేష్, దేవిరెడ్డి ఆదిత్య, రహీమ్ పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

అగ్నిమాపక అనుమతిలేని ఆసుపత్రి మూసివేత

కడప రూరల్ : అగ్నిమాపక శాఖ ఎన్ఓసీ లేని కారణంగా కడప నగరంలోని నాగప్రశాంత్ యూరో కేర్ ఆసుపత్రిని వైద్యాధికారులు మూసివేశారు. ఈ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం జరగడంతో గురువారం ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ తనిఖీ చేశారు. అగ్ని ప్రమాదం తీరును, ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆసుపత్రికి ఫైర్ ఎన్ఓసీ లేనందున ఆసుపత్రిని మూతవేశామన్నారు.

విద్యార్థిని అదృశ్యం

రాయచోటి (సంబేపల్లి) : బర్త్ సర్టిఫికెట్ కోసం సంబేపల్లి మండల కేంద్రానికి వచ్చిన విద్యార్థిని ఎనుగొండ ఆశ(18) అదృశ్యమైంది. సంబేపల్లి మండలం నాగిరెడ్డిపల్లి పంచాయతీ అన్నప్పగారిపల్లికి చెందిన ఎనుగొండ రమణయ్య కుమార్తె ఆశ. ఈమె కడప కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం బర్త్ సర్టిఫికెట్ కోసం మండల కేంద్రానికి వచ్చిన కుమార్తె సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తండ్రి రమణయ్య కుమార్తెకు ఫోన్ చేసినా స్పందన రాలేదు. రెండు రోజుల పాటు కనిపించకుండా వెళ్లిన విద్యార్థిని కోసం కళాశాల, ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆరా తీసినా సమాచారం దొరకలేదు. దీంతో విద్యార్థిని తండ్రి రమణయ్య గురువారం సంబేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

టోల్ వసూలు చేస్తే ప్రజా ఉద్యమం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్ర రహదారులకు టోల్ గేట్ వసూలు చేస్తే ప్రజా ఉద్యమం తప్పదని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రోడ్లకు ఎక్కడ మహర్దశ పట్టిందో కూటమి ప్రభుత్వం చెప్పాలన్నారు. ప్రజల నెత్తిన భారం వేస్తూ రోడ్లను నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటి వరకూ నేషనల్ హైవేలపైనే టోల్ వసూలు చేస్తున్నారని, కానీ చంద్రబాబు చెప్తున్న పీపీపీ విధానంలో ఇక రాష్ట్రంలో వేసే రోడ్లకు కూడా టోల్ వసూలు చేయబోతున్నారన్నారు. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో రహదారుల నిర్మాణం ఉంటుదని, కానీ చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానంలో పబ్లిక్ లేరన్నారు. టీడీపీ కాంట్రాక్టర్లకు ఆదాయం సమకూర్చడానికే ఈ విధానాన్ని తీసుకొస్తున్నారన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు ప్రజల దగ్గర లూటీ చేసి తమ పార్టీ వారికి మాత్రమే సంపద సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. కొత్తగా కొనే వాహనాలకు లైఫ్ ట్యాక్స్, పెట్రోల్, డీజిల్‌పై రోడ్ డెవలప్‌మెంట్ సెస్సులు వసూలు చేస్తున్నారని, ఆర్ అండ్‌బీకి రూ.803 కోట్లు కేటాయించారని ఈ డబ్బంతా ఎక్కడికి వెళ్తుందని ప్రశ్నించారు. ఫాస్టాగ్‌ను ఫాస్టెస్ట్ స్టాగ్‌గా మారుస్తున్నారన్నారు. జిల్లాలో 11 రహదారులపై టోల్ వసూలు చేయడానికి రంగం సిద్ధం చేశారని, మరో 9 రహదారులపై రెండో దశలో వసూలు చేయబోతున్నారన్నారు. దీనికి ఎమ్మెల్యేలు పచ్చజెండా ఊపారని చెప్పడం దారుణమన్నారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తున్నా.. కొప్పర్తిలోని స్కిల్ సెంటర్‌ను గుంటూరుకు తరలించినా టీడీపీ ఎమ్మెల్యేలు నోరు మెదపక పోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథరెడ్డి, సుబ్బరాయుడు, భాస్కర్ పాల్గొన్నారు.

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై మాట నిలబెట్టుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం దీక్షలు చేసిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాట నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఆర్సెలర్ మిట్టల్ – నిప్పన్ స్టీల్ ఇండియా ఉమ్మడిగా రూ. 1,47,162 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఉక్కు ఫ్యాక్టరీకి కావాల్సిన అనుమతులు, కేటాయింపులకు ఉపక్రమించిన కూటమి ప్రభుత్వం కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలన్నారు. కడప జిల్లాలో రూ. 20వేల కోట్ల అంచనా వ్యయంతో, 10 లక్షల టన్నుల సామర్థ్యంతో ప్రత్యక్షంగా 25వేలు, పరోక్షంగా 1 లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖర్ రెడ్డి 2007 జూన్ 10వ తేదీన బ్రహ్మణి ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేయలేదని అప్పటి రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, బీటెక్ రవి 2018 జూన్ 20న కడప జిల్లా పరిషత్ ఆవరణలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని గుర్తు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉక్కు ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తుందని దీక్షలు విరమింపజేసి 2018 డిసెంబర్ 27న మైలవరం మండలం, కంబాల దిన్నెలో రూ. 18000 కోట్ల అంచనా వ్యయంతో 30 లక్షల టన్నుల సామర్థ్యంతో రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి 3000 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. కానీ నిర్మాణానికి నోచుకోలేదన్నారు. అనకాపల్లిలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి చర్యలు ప్రారంభించిన నేపథ్యంలో గతంలో కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం దీక్షలు చేపట్టిన సీఎం రమేష్, శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫ్యాక్టరీ నిర్మాణం పై స్పష్టమైన ప్రకటన చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో గంగాసురేష్, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యం

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



ఒంటిమిట్ట: రహదారిలో గుంతలను పూడ్చుతున్న ఆర్అండ్‌బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

రాజంపేట : సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా కూటమి సర్కారు ముందుకెళుతోందని రోడ్లు భవనాలశాఖ మంత్రి, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. రాజంపేటలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో గురువారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆర్అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డి ఆయనకు రోడ్ల పరిస్థితి గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ వైఖోమ నైదియాదేవి, టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, క్షత్రియ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, నాయకులు సుబ్రమణ్యం నాయుడు, రాంనగర్ సంజీవి, డాక్టర్ సుధాకర్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించిన మంత్రి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలం మల్లకాటిపల్లిలో పాట్‌హోల్ ఫ్రీ ఏపీ (గుంతల రహిత రోడ్ల) కార్యక్రమంలో భాగంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రోడ్ల మరమ్మతు పనులను పర్యవేక్షించారు. అనంతరం రూ. 4.9 లక్షలతో మల్లకాటిపల్లి నుండి బెస్తపల్లి వరకు 11 కిలోమీటర్ల మేర చేపట్టిన రహదారుల ప్యాచ్ వర్క్ పనులలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 53వ జీఓ 349 ప్రకారం రాష్ట్రంలో గుంతల రహిత రహదారులను నిర్మించేందుకు కడప జిల్లాకు 269 పనులకు రూ.38.53 కోట్లు ఇచ్చిందన్నారు.

దశలవారీగా సూపర్‌సిక్స్ అమలు

ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తామని రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఒంటిమిట్ట పర్యటనలో భాగంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఆరు నెలల్లో పింఛన్ పెంచాం, డీఎస్సీకి సిద్ధమవుతున్నాం, ఉచిత గ్యాస్ సిలిండర్‌ను వదిలాం, త్వరలో ఉచిత బస్‌ను కూడా తీసుకొస్తాం అన్నారు. సూపర్ సిక్స్‌లో ఏ పథకాలు చెప్పామో అవన్నీ దశల వారీగా ఇస్తామన్నారు. కాగా, నిత్యం సమస్యలతో ఆగిపోతున్న ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకం పంపహౌస్‌కి మరలా పూర్వ వైభవంగా తీసుకురావాలని ఒంటిమిట్ట మండల టీడీపీ నాయకుడు కొమర వెంకటనరసయ్య కోరగా దానికి మంత్రి జనార్దన్ రెడ్డి స్పందిస్తూ గతంలో టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు.

రైస్‌పుల్లింగ్ చీటింగ్ కేసులో ముగ్గురి అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : రైస్‌పుల్లింగ్ పేరుతో మోసగించిన కేసులో ముగ్గురిని టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రైస్‌పుల్లింగ్ వ్యాపారంలో అరుదుగా లభించే ఇరిడియం లోహంతో తయారు చేసిన పాత్రలు కలిగి ఉంటే వాళ్ల జీవితాలు మారిపోతాయని మాయ మాటలు చెప్పి దువ్వూరు మండలం గోపులాపురం గ్రామానికి చెందిన మూలె వెంకటరమణారెడ్డిని ఇరువురు మహిళలు మోసగించారు. అతని నుంచి సుమారు రూ. 1.37 కోట్లు వసూలు చేశారు. ఈ క్రమంలో మోసానికి పాల్పడ్డ బెంగళూరుకు చెందిన అగిలి అపర్ణ, కదిరికి చెందిన అగిలి అరుణకుమారి, అనంతపురం టౌన్‌కు చెందిన నడిమింటి రామాంజనేయులును గురువారం మదూరు రోడ్డులో అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు.

ఆశా వర్కర్ల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగానికి భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని తక్షణం నెరవేర్చాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి సుభాషిణి, యూనియన్ జిల్లా నిర్మాణ బాధ్యుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, రాజకీయ నాయకుల అధికారుల వేధింపులు ఆపాలని, ఉద్యోగాలకు భద్రత కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు, బి.శాంతమ్మ, శోభారాణి, అనసూయ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

మదనపల్లె : కారు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలం చేనేతనగర్‌లో జరిగింది. ములకలచెరువుకు చెందిన బాబా ఫకృద్దీన్(42), అతడి భార్య ముబీన్‌తాజ్(35), కుమార్తె నఫియాఫిర్దౌస్(4)లు ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా చేనేతనగర్ వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గుర్రంకొండ మండలం సూరప్పగారిపల్లెకు చెందిన రెడ్డిరాజు భార్య దుర్గ(26) అత్త తిట్టిందని పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించడంతో 108 అంబులెన్స్‌లో బాధితురాలిని మదనపల్లెకు తీసుకు వస్తున్నారు. 108 సిబ్బంది మార్గమధ్యంలో చేనేత నగర్ వద్ద రోడ్డుప్రమాద ఘటనలో గాయపడిన ముగ్గురినీ వాహనంలోకి ఎక్కించుకుని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఎక్సైజ్ దాడుల్లో కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : మండలంలో ఎక్సైజ్ సిబ్బంది జరిపిన దాడుల్లో వేర్వేరు ప్రాంతాల్లో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ భీమలింగ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బార్లపల్లె గ్రామశివారులో కర్ణాటక అక్రమ మద్యం కలిగి ఉన్న కుమారిని అరెస్ట్ చేసి, 96 టెట్రా ప్యాకెట్లను సీజ్ చేశామన్నారు. అలాగే మండలంలోని వేంపల్లె క్రాస్ వద్ద కర్ణాటకకు చెందిన అక్రమ మద్యం విక్రయిస్తున్న చీకలబైలుకు చెందిన వెంకటరమణ అలియాస్ సుల్తాన్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 28 టెట్రా ప్యాకెట్లను స్వాధీం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐ జబీవుల్లా, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రంగానాయక్, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి, శివరాణి పాల్గొన్నారు.

సౌత్, సెంట్రల్ జట్లు విజయం

సెంచరీలతో చెలరేగిన రేవంత్, శ్రావణ్



తలపడుతున్న సెంట్రల్, సౌత్‌జోన్ జట్లు



151 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన తూర్పుగోదావరి బ్యాట్స్‌మన్ సాయిశ్రావణ్



131 పరుగులు చేసిన సౌత్‌జోన్ బ్యాట్స్‌మన్ కె. రేవంత్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–23 జోనల్ క్రికెట్ మ్యాచ్‌లలో సౌత్‌జోన్, సెంట్రల్‌జోన్, తూర్పుగోదావరి జట్లు విజయం సాధించాయి. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్టాఫ్ సెంట్రల్, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్ జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 203 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కె.ఎస్.ఎన్. రాజు 56, స్వామి నాయుడు 43 పరుగులు చేశారు. అనంత బౌలర్లు దత్తారెడ్డి 3, లోహిత్‌సాయి 2, దీపక్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 37.2 ఓవర్లలో 176 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని యోగానంద 46, జయకృష్ణ 37 పరుగులు చేశాడు. సెంట్రల్‌జోన్ బౌలర్లు మానస్ 4, సుశాంత్‌నాయుడు 4 వికెట్లు తీశారు. దీంతో రెస్టాఫ్ సెంట్రల్‌జోన్ జట్టు 26 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

సౌత్‌జోన్ విజయం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్టాఫ్ నార్త్‌జోన్, రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. జట్టులోని హర్షవర్ధన్ 63, పూర్ణతేజ 55 పరుగులు చేశారు. సౌత్‌జోన్ బౌలర్లు అఖిల్ 3, సాకేత్‌రామ్ 2, మాధవ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్టు 45.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని కె. రేవంత్‌రెడ్డి 97 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్‌లతో చెలరేగాడు. ఈయనకు జతగా నిఖిలేష్ 54 పరుగులు చేశాడు. దీంతో సౌత్‌జోన్ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

తూర్పుగోదావరి జట్టు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో ప్రకాశం, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ప్రకాశం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 46.2 ఓవర్లలో 286 పరుగులు చేసి ప్రకాశం జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని రోహిత్ 77, అభినవ్ 92 పరుగులు చేశారు. తూర్పుగోదావరి బౌలర్లు శివ 4, వంశీనారాయణ 3 వికెట్లు తీశారు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 47.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని టి.వి. సాయిశ్రావణ్ 138 బంతుల్లో 18 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 151 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. పాండురంగరాజు 37 పరుగులు చేశాడు. దీంతో తూర్పుగోదావరి జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.